క్లుప్తంగా

లక్ష్యంతో చదివితే విజయం సొంతం



విద్యార్థినులతో మాట్లాడుతున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం

అడ్డతీగల: విద్యార్థులు లక్ష్యంతో చదివితే విజయం సొంతమవుతుందని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో మెనూ అమలుతీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. పుస్తక పఠనం అలవర్చుకోవాలని, జనరల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని చేనుపాకలులో నీతి ఆయోగ్ ద్వారా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం డీఈ నాగరాజుని ఆదేశించారు.

ఇంటర్ పాఠ్యపుస్తకాల పంపిణీ

హుకుంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఇంటర్మీడియట్ దశ నుంచే విద్యార్థులు లక్ష్యం ఏర్పాటుచేసుకొని బాగా చదవాలన్నారు.వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు, సిబ్బంది కిరణ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్ పాల్గొన్నారు.

9న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి ఈనెల 9న మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూల ద్వారా అర్హులైన వారిని ఎంపిక చేస్తామన్నారు. రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకు, జడ్డంగిలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, అన్ని వివరాలతో హాజరుకావాలని కోరారు.

వ్యవసాయ రుణాలకు దరఖాస్తులు

చింతపల్లి: ఖరీఫ్‌లో పంట రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులకు కావలసిన పంట రుణాలకు సంబంధించి అవగాహన కల్పించినట్టు చెప్పారు. రుణాలు అవసరమైన రైతులు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీ పట్టా పొందిన నిరుద్యోగ యువతకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. వ్యవసాయ క్లినిక్‌లు, వర్మీకంపోస్టు తయారీ యూనిట్లు, శీతల గిడ్డంగుల నిర్మాణం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపనకు నాబార్డు వారి ఆర్థిక సహాయంతో రాయితీపై రుణాలు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలన్నారు.

భూసమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ రమేష్

ముంచంగిపుట్టు: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ వి.రమేష్ అన్నారు. మండలంలో గల బీట గ్రామంలో సోమవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ల్యాండ్ పార్సల్ నంబర్, విస్తీర్ణం తదితర సమస్యలపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. రీసర్వేలో అభ్యంతరములను రైతుల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ రీసర్వేలో పొరపాట్లు ఉంటే వెంటనే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని, భూముల సర్వేలో తప్పులను సరిచేయడం, కొత్త పాసు పుస్తకాలు అందించడం జరుగుతుందని, రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఎస్ సర్వేయర్ భూపతిపడాల్, వీఆర్‌వో భాస్కర్, సర్వేయర్లు సదాశివ, ఉమా పార్వతి, వీరయ్య, వార్డు మెంబర్ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

అమాత్యా...పట్టించుకోరయ్యా!

- శిథిలావస్థలో అటవీశాఖ కార్యాలయ భవనాలు
- ఎప్పుడూ కూలిపోతుందో తెలియని పరిస్థితి
- ఆందోళనలో సిబ్బంది
- కొత్త భవనాలు మంజూరు చేయాలని అటవీశాఖ మంత్రిని కోరుతున్న గిరిజనం



శిథిలదశకు చేరనున్న ముంచంగిపుట్టు అటవీశాఖాధికారి భవనం



శిథిలావస్థకు చేరిన అటవీశాఖ భవనం



పాడైన గచ్చు

ముంచమంగిపుట్టు: మండల కేంద్రంలో ఉన్న అటవీశాఖ కార్యాలయ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాల గోడలు బీటలు వారి తలుపులు, కిటికీలు ఊడిపోతున్నాయి. భవనాల పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో అటవీశాఖ సిబ్బంది భయపడుతూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం పడితే నీరు కారడంతో కార్యాలయ రికార్డులు, సామగ్రిలు భద్రపరించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొనే విధులు నిర్వహిస్తున్నారు. అటవీశాఖ భవనాలు నిర్మించి చాలా ఏళ్లు అవుతుండడంతో భవనాల పరిస్థితి ఘోరంగా ఉంది. గతంలో పెదబయలు రేంజ్‌లో ఉన్న ముంచంగిపుట్టును మరొక రేంజ్‌గా అధికారులు మార్చారు. కానీ కార్యాలయ నిర్వహణకు భవనాలు కల్పించలేదు. దీంతో అటవీశాఖ నర్సరీల పెంపకానికి ,రైతులకు శిక్షణ ఇచ్చేందుకు 30ఏళ్ల కిందట నిర్మించిన భవనాలనే అటవీశాఖ సిబ్బంది కార్యాలయంగా వినియోగిస్తున్నారు. మరుగుదొడ్డి సైతం పాడైపోయి, నిరుపయోగంగా మారింది. భవనాల పరిస్థితి దారుణంగా ఉండడంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. భవనాల గోడలు, శ్లాబ్ పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.



పాడైన కిటికీలు, తలుపులు

చెదలుపట్టిన కిటికీలు, తలుపులు

అటవీశాఖ కార్యాలయ గదులకు ఏర్పాటు చేసిన తలుపులు, కిటికీలకు చెదలుపట్టి చాలా వరకు పాడైపోయాయి. కొన్ని కిటికీల తలుపులు వేసే పరిస్థితి లేదు. ప్రయత్నం చేస్తే ఊడిపోతున్నాయి. దీంతో అప్పుడుప్పుడు విష సర్పాలు కార్యాలయ భవనాలలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో సిబ్బంది భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఒకటి, రెండు సార్లు మరమ్మత్తులు చేసి, రంగులు వేయించారు. అయినా సరే శిథిలావస్థకు చేరడంతో పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం పడేటప్పుడూ పలు చోట్ల నీరు కారుతుండడంతో విధులకు సైతం ఆటంకం కలుగుతుంది. అటవీశాఖ కార్యాలయ నిర్వహణ, రైతులకు శిక్షణ ఇచ్చేందుకు నిర్మించిన భవనాలు పూర్తిగా పాడయ్యాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. మన్యం పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్, స్పందించి అటవీశాఖకు చెందిన భవనాల సమస్యలను పరిష్కరించాలని సిబ్బందితో పాటు స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు

అటవీశాఖ కార్యాలయ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. కిటికీలు, తలుపులు పాడైయ్యాయి. భవనాల పైకప్పు నుంచి పెచ్చులు పడుతున్నాయి. అప్పుడప్పుడు విష సర్పాలు గదుల్లోకి వస్తున్నాయి. శాఖపరమైన సమావేశాలు, రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం కోసం ఇబ్బందులు పడుతున్నాం. భవనాల పరస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశాం. నూతన భవనాలు నిర్మిస్తే మంచిది.

– పి.వెంకయ్య చౌదరి, ఫారెస్టు రేంజర్, ముంచంగిపుట్టు

సాధారణ ప్రసవాలతో ఆరోగ్యానికి మేలు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

చింతూరు: సాధారణ ప్రసవాలతో తల్లి, బిడ్డకు ప్రయోజనమని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి అన్నారు. సాధారణ కాన్పులను ప్రోత్సహించడంలో భాగంగా సోమవారం ఆస్పత్రిలో గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి మాట్లాడుతూ సాధారణ కాన్పులపై అపోహలు పెంచుకుని అనేకమంది సిజేరియన్లు ఎంచుకుంటున్నారని, దీని వలన తల్లి, బిడ్డకు నష్టం జరిగే అవకాశముందన్నారు. సాధారణ కాన్పుల వలన ఇన్ఫెక్షన్ సమస్య ఉండదని, ఆరోగ్యం త్వరగా కుదుట పడుతుందని, బిడ్డకు తల్లిపాలు పెరుగుతాయన్నారు. డాకర్లు రమణారావు,శశికళాదేవి పాల్గొన్నారు.

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

హుకుంపేట: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ చెప్పారు. మండలంలోని దాలిగుమ్మడిలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి బోరు నిర్మాణ పనులకు ఆమె సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ నిర్మాణ పనులు ప్రారంభం

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీ లక్కుళ్ల గ్రామంలో సోమవారం చెక్‌డ్యామ్ నిర్మాణ పనులను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, ఎస్.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు ప్రారంభించారు. లక్కుళ్ల గ్రామంలోని రైతులు పంట భూములకు సాగునీరు అందించేందుకు రూ.19.50లక్షతో చెక్‌డ్యామ్ నిర్మాణానికి నిధులు విడుదల చేసినట్టు చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ స్వాతి, గ్రామ పెద్దలు కొండలరావు, రమేష్, చిన్నబ్బాయి, అంజిబాబు, ప్రసాద్, మంగుడు, గిరిబాబు, లక్ష్మణరావు, వార్డు సభ్యుడు రాజారావు పాల్గొన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి



పినలోచలిలో సమావేశమైన అర్చక పురోహితులు

జి.మాడుగుల: మండలంలో పినలోచలి గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం మండల అర్చక పురోహితుల సమావేశం జరిగింది. ధర్మ ప్రసార జిల్లా ప్రముఖులు మల్లిబాబు, అప్పలరాజు మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. అమలేశ్వరి, రామకృష్ణ, అప్పలనాయుడు, వెంకటరమణ, మత్స్యరాజు, గంగాధరావు, ఆనందరావు అశోక్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



పేదలకు నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మయ్య

చింతపల్లి: మండలంలోని తమ్మెంగుల పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంలో గూంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద గిరిజనులకు దుస్తులు, నిత్యావసర సరకులను సర్పంచ్ లక్ష్మయ్య సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూంజ్ స్వచ్ఛంద సంస్థ ఏటా గిరిజన గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతుందని, పలు ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధి కొండబాబు మాట్లాడుతూ నిరుపేదలకు అండగా నిలవాలన్నదే తమ సంస్థ లక్ష్యమన్నారు. పేదలకు అవసరమైన సౌకర్యాలను సంస్థ తరఫున సమకూర్చుతున్నారమన్నారు. రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు 360 దరఖాస్తులు



ఎంపీడీవో విజయ

అడ్డతీగల: అడ్డతీగల మండల వ్యాప్తంగా బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 23 యూనిట్లకు గాను 360 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నట్టు అడ్డతీగల ఎంపీడీవో కె.ఆర్.విజయ తెలిపారు. ఆయా దరఖాస్తులు పరిశీలన అనంతరం ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



జడేరు సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

గంగవరం: సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరై సేవలందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సూచించారు. గంగవరం మండలం జడేరు గ్రామ సచివాలయాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం తగదని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. పంచాయితీలోని కురమగొందిలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించారు. రెండు మాసాల్లో నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



చుట్టుమెట్ట మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం



కారును ఢీకొన్న వ్యాన్

పెదబయలు: మండలంలోని అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న కారు, వ్యాన్ సోమవారం ఢీకొన్నాయి. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాడేరు నుంచి ముంచంగిపుట్టు వెళ్తున్న కారును ముంచంగిపుట్టు నుంచి వస్తున్న వ్యాన్ చుట్టుమెట్ట మలుపు వద్ద ఢీకోంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. రెండు వాహనాల్లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మలుపు వద్ద కారు వేగంగా రావడం వల్లే ప్రమాదం జరిగినట్టు చెప్పారు. వ్యాన్ నెమ్మదిగానే వెళ్తుండడంతో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఈ విషయంపై పెదబయలు ఎస్ఐ రమణ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన చోట రెండు వాహనాలు లేవని, దీనిపై విచారణ చేస్తామన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఏవో పాత్రుడు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం వెలుగు సంస్థ, మండల వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో పాత్రుడు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పంటల అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఏపీఎం ఈశ్వరనాయుడు మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. రైతు సాధికార సంస్థ డివిజన్ ఎస్ఎఫ్ఏ ప్రసాద్ మాట్లాడుతూ అంతర పంటల సాగు వల్ల కలిగే ఉపయోగాలని వివరించారు. రామకృష్ణ, ప్రసాద్, రామలింగం,కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం
- వాడవాడలా అవగాహన ర్యాలీలు
- తరలివచ్చిన వైద్యులు, సిబ్బంది



జీకే వీధిలో ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి, సిబ్బంది



కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

గూడెంకొత్తవీధి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా భారీ ర్యాలీలు నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పృథ్వీష మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఇందుకోసం మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు, హెచ్‌వీ రోజీగోల్డ్ పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్ మాట్లాడుతూ మాతా శిశు మరణాల నివారణే లక్ష్యమన్నారు. ఆస్పత్రుల్లోని ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి ప్రకాష్ పాల్గొన్నారు.

ఎటపాక: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండలంలోని నెల్లిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.వైద్యాధికారి విష్ణుప్రియ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. డాక్టర్ నాగమణి, పీహెచ్ఎన్ అరుంధతి, సూపర్‌వైజర్ సీతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ ఆరోగ్యభద్రతపై అవగాహన కల్పించారు. డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవాలన్నారు. సహజ ప్రసవాలతోనే తల్లి, బిడ్డకు ఆరోగ్యం చేకూరుతుందన్నారు. శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. ఆయుర్వేదిక్ డాక్టర్ స్వర్ణలత, పీహెచ్ఎన్ భద్రకాళి, హెచ్‌వీ పున్నమ్మ, ఏఎన్ ఎంలు చంద్రమ్మ, అనూష, భీమమ్మ, హెచ్ఏ శ్రీనివాస్, మంగ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కూనవరం, కూటూరు వైద్యాధికారులు రాజీవ్, శ్రీనివాసమూర్తి దొర ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలని, అప్పుడే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. ఆస్పత్రిలోని ప్రసవాలు తల్లీ, బిడ్డకు ఆరోగ్యం, ఆనందమన్నారు. డాక్టర్ విజ్ఞ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసు, సీతమ్మ, ఏఎన్ఎంలు, ఎంపీ హెచ్‌ఓలు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణ అధికారి కోడ మహేష్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు.



జి.మాడుగులలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ ధనుష్, వైద్య సిబ్బంది



వీ.ఆర్.పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



నెల్లిపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



వీ.ఆర్.పురంలో వైద్య సిబ్బంది మానవహారం

నేడు ఉపమాకలో శివపార్వతుల కల్యాణం

12వ తేదీ వరకు ఉత్సవాలు

నక్కపల్లి: ప్రముఖ పురాతన శివాలయం ఉపమాకలో భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఆలయంలో గణపతి పూజ, శుద్ధి పుణ్యాహవచనం, అంకురార్పణ, రాత్రి 6.30 నుంచి సప్పరం వాహనంలో పరమేశ్వరుడ్ని పల్లకిలో పార్వతి దేవిని ఉంచి ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. మైలవరభట్ల జోగారావు ఇంటి వద్ద ఎదురు సన్నాహ మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ పెళ్లిమాటల తంతును వేదపండితురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవి వ్యాఖ్యానంలో జరుగుతుందన్నారు. పెళ్లి కుమారుడు తరపున నక్కపల్లికి చెందిన శింగంశెట్టి వారి కుటుంబీకులు, పెళ్లి కుమార్తె తరపున ఎం.వి.వి.ఎస్ మూర్తి (సహరా పంతులు) వారి కుటుంబ సభ్యులతో నిర్వహిస్తామన్నారు. అనంతరం శింగంశెట్టి కుటుంబీకులతో ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. రాత్రి 8.30 నుంచి 10.30 గంటల వరకు స్వామివారి ఆలయంలో తాత్కాలిక కల్యాణ వేదిక వద్ద శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. 9వ తేదీన కుంకుమ పూజ, 10న సదస్యం, 11న తోట ఉత్సవం, 12న పూర్ణాహుతి స్వామివారి పుష్పయాగోత్సవం, పవళింపు సేవ జరుగుతాయన్నారు.

సెల్‌ఫోన్ చోరీపై ఫిర్యాదు

రాజవొమ్మంగి: స్థానిక పోస్టుమాన్ విక్రమహంతి అప్పారావు సెల్‌ఫోన్‌ను సోమవారం దొంగలు తస్కరించారు. యూనియన్ బ్యాంకు ఎదుట జాతీయ రహదారిపై సైకిల్‌పై నెమ్మదిగా వెళ్తుండగా తన షర్ట్ జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను వెనుక నుంచి వేగంగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు లాక్కొని పర్యారయ్యా రైనట్టు అప్పారావు చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. రాజవొమ్మంగిల దొంగతనాలు ఇటీవల పెరిగిపోయాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ అధికారులు నిఘా పెంచాలని కోరుతున్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి: పాపయ్య సంతపాలెం శివారులో 20 మద్యం క్వాటర్ బాటిళ్లతో అదే గ్రామానికి చెందిన కె.వెంకటరమణ పట్టుబడినట్లు రూరల్ ఎస్ఐ రవి కుమార్ సోమవారం తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.